క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కంకలమ్మ ఆలయంలో పూజలు


మహాయజ్ఞం చేస్తున్న భక్తులు

కౌటాల: కంకలమ్మ ఆలయ మహాజాతరలో భాగంగా శనివారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం నిర్వహించారు. ఆలయంలో భక్తులు కూష్మాండ బలిహారణము, కళానాస్యము నిర్వహించారు. మహా పూర్ణాహుతి, అవబృథ స్నానము, మహదాశీర్వచనం కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి

ఆసిఫాబాద్‌రూరల్: బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు నిర్వహించనున్నట్లు ఎస్‌వో శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా 15 నుంచి 19 ఏళ్ల బడి బయట పిల్లలను సీఆర్‌పీలు ఇంటింటి సర్వే చేసి గుర్తించి బడిలో చేర్పించాలని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో అన్నదానం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని దుబ్బగూడ కాలనీలో గల శ్రీ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తుల సౌకర్యార్థం హనుమాన్ ఆలయ కమిటీ, దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ప్రతీ శనివారం దాతల సహకారంతో ఆలయంలో అన్నదానం ఉంటుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు షిండె సందీప్, ప్రభాకర్, శంకర్, కిశోర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కౌటాల: మండలంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం పర్యటించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని సదాశివపేట్‌లోని శివాలయంలో పాల్వాయి హరీశ్‌బాబు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం హరీశ్‌బాబు తొలిసారి కౌటాలలో పర్యటించనున్నారని, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రతీ గడపకు మంచినీరు అందించాలి

జైనూర్: మండల కేంద్రంలో ఎంపీపీ కుమ్ర తిరుమల అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు తమ నివేదికలను శాఖల వారీగా ప్రజాప్రతినిధులకు విన్నవించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీపీ కుమ్ర తిరుమల మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మిషన్ భగీరథ అధికారులు కారణాలు చెబుతున్నారే తప్పా గ్రామాల్లో మంచినీరు అందించడం లేదని మండిపడ్డారు. ప్రతీ గడపకు శుద్ధ జలాన్ని అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభుదయ, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మండల వైద్యాధికారి అశోక్, పంచాయతీ రాజ్ ఏఈ చంద్రశేఖర్, మండల ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం ఐదు బృందాలుగా ఏర్పాటు చేసి, సికిల్‌సెల్ వ్యాధిపై రక్తపరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ సోమవారం, మంగళవారం, గురువారం, శుక్రవారం సికిల్‌సెల్ పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, హెచ్‌ఈ నాందేవ్, ప్రధానోపాధ్యాయుడు విఠల్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బోథ్: మండలంలోని నిగిని పరిధిలోని కైలాస్ టెకిడి సర్వదేశ్వర ఆలయం 21వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ముగింపు రోజున కాశీ జగద్గురు మల్లికార్జున్ విశ్వరాధ్యాయ శివాచార్య మహరాజ్, శాంతి వీరలింగ శివాచార్య, మహరాజ్, భీమ లింగేశ్వర శివాచార్య మహరాజ్, లింబాజీ మహరాజ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాలతో రుద్రాభిషేకం, హారతి, మండపం పూజ, బ్రహ్మణ పూజ, హోమం, పూర్ణహారతి నిర్వహించారు.

కంకలమ్మ జాతరకు వేళాయె!

- నేడు 19వ మహా జాతర
- ఏర్పాట్లు పూర్తి
- ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక


గుట్టపై జాతరకు ముస్తాబైన కంకలమ్మ ఆలయం

కౌటాల: మండల కేంద్రం సమీపంలోని శ్రీ కేతేశ్వర స్వామి –కంకలమ్మ గిరిపై వెలిసిన శ్రీ స్వయంభూ శ్రీ కంకలమ్మ కేతేశ్వర స్వామి 19వ మహా జాతరకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో నేడు ఉదయం 4.30 గంటల నుంచి శతఛిద్ర మహాభిషేకం, అలంకరణ, షోడషోపచారములు, సందర్శన, సాయంత్రం వరకు మహాజాతర కార్యక్రమం నిర్వహించనున్నారు. మహాజాతరకు ఇతర జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం వేలాది భక్తులు తరలిరానున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు..

మండల కేంద్రం సమీపంలోని ఎత్తైన గుట్టపై ఉన్న శ్రీ కేతేశ్వర స్వామి –కంకలమ్మ దేవాలయంలో నేడు జరిగే జాతర ఉత్సవాల కోసం ఆలయం ముస్తాబైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల కోసం బారికేడ్లు, సమీయాలు ఏర్పాట్లు చేస్తున్నారు.. ప్రతీ సంవత్సరం కార్తీక మాసం చివరి ఆదివారం జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరకు కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తమ కులదైవాన్ని కొలిచేందుకు మేదరి కులస్తులతో పాటు భక్తులు అసంఖ్యాకంగా తరలివస్తుంటారు. లేత బొంగులు వచ్చే ఈ కాలంలో మేదరి కులస్తులు ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు మెట్లదారిలో కాలినడకన గుట్టపైకి చేరుకోవాల్సి ఉండగా చుట్టూ ఉన్న గుట్టలు, అడవి ప్రకృతి దృశ్యాలు ఎంతో ఆకట్టుకుంటాయి. ఆలయం చుట్టూ గుట్టపై ఉన్న పారిజాత వృక్షాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

జాతరకు భారీ బందోబస్తు..

కంకలమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కౌటాల సర్కిల్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని పోలీసులతో పాటు ప్రత్యేక పోలీస్ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. సిర్పూర్(టి), కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులు ద్విచక్ర, ఇతర వాహనాలను స్థానిక మినీ స్టేడియంలో, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కౌటాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 11వ తేదీ వరకు జాతర కొనసాగనుండగా, 12న మహాప్రసాదం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఇలా వెళ్లొచ్చు..

కౌటాల మండల కేంద్రంలోని సమీప గుట్టపై కంకలమ్మ దేవి ఆలయం ఉంది. కాగజ్‌నగర్ నుంచి కౌటాల 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాగజ్‌నగర్, సిర్పూర్(టి) వరకు రైల్వే సౌకర్యం ఉంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) నుంచి కౌటాలకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. జాతర కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా ఎనిమిది ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు.

భక్తులు సహకరించాలి



జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. సిర్పూర్(టి), కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులు వాహనాలను కౌటాల మినీ స్టేడియంలో, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులు కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో వాహనాలను పార్కింగ్ చేయాలి. కంకలమ్మ జాతర ప్రశాంతంగా జరగడానికి పోలీస్ శాఖకు భక్తులు సహకరించాలి.

– ఎన్. మధుకర్, ఎస్సై

నిలిచిన రహదారి పనులు!

- సర్కేపల్లి రహదారికి అటవీ అనుమతులు అడ్డంకి
- మూడేళ్లుగా కొనసాగని పనులు
- పూర్తి చేయాలని కోరుతున్న ఆదివాసీలు


గర్భిణిని ఎడ్ల బండిపై ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబసభ్యులు (ఫైల్)

వాంకిడి: మండలంలోని ఆదివాసీ గ్రామాల ప్రజలు సరైన రహదారులు లేక తిప్పలు పడుతున్నారు. బురద, దుమ్ము, బండరాళ్లు తేలిన దారుల మీదుగానే ప్రయాణాలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో ఏమీ చేయలేని స్థితిలో అల్లాడుతున్నారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు ఇచ్చిన హామీలు గాలికొదిలేస్తూ, కనీసం తమ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆదివాసీలు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం మండలంలోని ఖమాన గ్రామం నుంచి సర్కేపల్లి వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద డబుల్ బీటీ రోడ్డు మంజూరైంది. నిర్మాణ పనులు సైతం ప్రారంభించారు. కానీ అధికారుల సమన్వయ లోపంతో అటవీశాఖ అనుమతులు రాక పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. మూడేళ్ల నుంచి నిలిచిన పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అటవీ అనుమతులు లేక..

మండలంలోని ఖమాన గ్రామం నుంచి మారుమూల ఆదివాసీ గ్రామం సర్కేపల్లి వరకు 9 కిలోమీటర్ల మేర డబుల్ బీటీ రోడ్డు మంజూరైంది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద సుమారు రూ.7 కోట్ల వ్యయంతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను రోడ్డు, భవన నిర్మాణ శాఖ (ఆర్ అండ్‌బీ) ఆధ్వర్యంలో చేపట్టారు. మంచిర్యాల కు చెందిన ఓ గుత్తేదారు గతేడాది పనులు ప్రారంభించారు. ఖమాన గ్రామం నుంచి మారేపెల్లి వరకు 6 కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులు పూర్తి కాగా సర్కేపల్లి వరకు మిగిలిన 3 కిలోమీటర్ల రోడ్డుకు అటవీశాఖ అనుమతులు రాలేదని పనులు నిలిచిపోయాయి. మారెపల్లి నుంచి సర్కేపల్లి మధ్యలో సుమారు 2 కిలోమీటర్ల ఆర్ఎఫ్ ల్యాండ్ ఉందని, అటవీశాఖ అనుమతులు రావడంలో జాప్యం జరుగుతుండడంతో పనులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. కాగా మూడేళ్ల క్రితం నిలిచిపోయిన రోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదు.

పది గ్రామాలకు మేలు..

ఖమాన గ్రామం నుంచి సర్కేపల్లి వరకు రోడ్డు నిర్మాణం పూర్తయితే మండలంలోని లక్ష్మీపూర్ పంచాయతి పరిధిలోని సర్కేపల్లి, పాక్టిగూడ, కోలంగూడతో పాటు కాగజ్‌నగర్ మండల పరిధిలోని లైన్‌గూడ, మారెపల్లి, ఆలిగూడ, మానిక్‌గూడతో పాటు దాదాపు 10 ఆదివాసీ గ్రామాల ప్రజలకు మేలు జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం పాటించి త్వరగా అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. సరైన రోడ్డు లేక అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– ఆత్రం గణేశ్, సర్కేపల్లి

విద్య, వైద్యానికి దూరం



బీటీ రోడ్డు, ఒర్రెలపై బ్రిడ్జిలు లేక వర్షాకాలంలో తిప్పలు పడుతున్నాం. పాఠశాలకు ఉపాధ్యాయుడు రావాలన్నా, అంబులెన్సు రావాలన్నా కష్టంగా మారింది.

– మేస్రం నాగుబాయి, సర్కేపల్లి

ఉచిత ప్రయాణ భాగ్యం లేనట్టేనా..?

- కాగజ్‌నగర్ రూట్‌లో బస్సు సర్వీసులు కరువు
- అధిక చార్జీలు వెచ్చించి ఆటోల్లో ప్రయాణం
- బస్సులు నడపాలని కోరుతున్న మండలవాసులు


దహెగాంకు వచ్చిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

దహెగాం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుంది. శనివారం నుంచే ఈ పథకం అమలు చేశారు. కాగా దహెగాం –కాగజ్‌నగర్ రూట్‌లో బస్సు సౌకర్యం లేకపోవడంతో మండలవాసులు ప్రైవేటు ఆటోల్లో అధిక చార్జీలు వెచ్చించి రాకపోకలు సాగిస్తున్నారు. మంచిర్యాల రూట్‌లో బస్సు సౌకర్యం ఉన్నా మండలం నుంచి కాగజ్‌నగర్‌కు వివిధ అవసరాల నిమిత్తం ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తుంటామని, ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సు సేవలు కల్పించాలని కోరుతున్నారు.

ఏడాదిగా బస్సు సర్వీసు నిలిపివేత..

దహెగాం –కాగజ్‌నగర్ రూట్‌లో సుమారు 15 గ్రామాలు ఉన్నాయి. దహెగాం నుంచి కాగజ్‌నగర్ 30 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రూట్‌లో అధికంగా మూలమలుపులు ఉండగా, కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామ సమీపంలో పెద్దవాగుపై వంతెన భారీ వరదల కారణంగా కూలిపోయింది. ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదని గత ఏడాది వాగులో పైప్‌లతో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు ఆర్టీసీ బస్సులు కూడా నడిపించారు. వర్షాకాలం ప్రారంభంలో వాగులో ఉధృతి పెరిగి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు పూర్తిగా నిలిపివేశారు. ప్రజలు కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణిస్తున్నారు. నెల రోజుల క్రితం వాగులో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసినా ఆర్టీసీ బస్సు సర్వీసులు మాత్రం నడవడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

మంచిర్యాల రూట్‌లో ఉచిత ప్రయాణం..

మంచిర్యాల డిపో నుంచి దహెగాం మండల కేంద్రానికి రోజూ మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యం కల్పించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం ఉంది. దీంతో మంచిర్యాల రూట్‌లో ఉచిత ప్రయాణం చేయవచ్చని మహిళలు హర్షం వ్యక్తం చేస్తునారు. కాగజ్‌నగర్ నుంచి దహెగాం రూట్‌లో ఆసిఫాబాద్ డిపో బస్సు సర్వీసులు లేనందున మహిళలు చార్జీలు వెచ్చించి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేసి నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం మండలవాసులు ఎక్కువగా కాగజ్‌నగర్‌కు వెళ్తుంటారని, అందవెల్లి పెద్దవాగులో ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు వేసినందున ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సులు నడిపించాలని మండలవాసులు కోరుతున్నారు.

అయోడిన్ పరీక్షలపై అవగాహన


అయోడిన్ పరీక్ష చేయిస్తున్న హెచ్‌ఈవో రవిదాస్

వాంకిడి: మండలంలోని ఖైరేట్ గ్రామంలో శనివారం ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. వంటల్లో వాడే ఉప్పులో అయోడిన్ శాతం ఎలా తెలుసుకోవాలో అక్కడి ఆశ వర్కర్‌కు వివరించారు. మోతాదుకు మించి అయోడిన్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సూచనలిచ్చారు. గ్రామ పరిసరాల్లో డ్రైడే నిర్వహించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. రాజేంద్రకుమారి, కళావతి, ఇరుకుల మంగ, వాసుదేవ్, ఆసిఫ్, జావిద్, శ్యాం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంతో పాటు, గోలేటిలో శనివారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు మురళీ, చిరంజీవిగౌడ్, గంటుమేర, పద్మ, రవీందర్, తులసీరాం, కిషన్‌గౌడ్, దుర్గం రవీందర్, సురేందర్‌రాజు, పోషం, తిరుపతి, సాయికిరణ్, రహీం, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, జిల్లా నాయకుడు సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, బ్లాక్ అధ్యక్షుడు ఆయ్యుబ్‌ఖాన్, మెస్రం శేకు, పెందూర్ ప్రకాశ్, ఆత్రం ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ అహల్యాదేవి

రెబ్బెన: కరీంనగర్‌కు చెందిన సన్‌షైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పంచాయతీ పరిధిలోని ప్రజలు వైద్య శిబిరానికి హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. సిబ్బంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్, రాజేష్, శంకరమ్మ, అన్నపూర్ణ అరుణ, మురళీగౌడ్, పద్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు పాటించాలి

భైంసాటౌన్: విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించాలని శ్రీ సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి కిషన్ అన్నారు. పట్టణంలోని గుజిరిగల్లి పాఠశాలలో ఉపాధ్యాయులకు శనివారం నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రకాల మెలకువలు పాటిస్తూ, కృత్యాల ఆధారంగా బోధన నిర్వహించాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, దేశభక్తి పెంపొందించేలా బోధనాంశాలు ఉంటాలన్నారు. ప్రబంధకారిణి సభ్యులు శ్రీధర్, కాశీనాథ్, సురేష్, రాజేశ్వర్, శివకుమార్, అజయ్, రాంమోహన్, గంగాధర్, ప్రధానాచార్యులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

పాతమంచిర్యాల: తెలంగాణలో కొలువుదీరిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి చర్యలు చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం బీసీ ఐక్య వేదిక సమన్వయ సమావేశం నిర్వహించారు. తెలంగాణలో బీసీ జనగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. బీసీ వర్గాల సామాజిక న్యాయం గురించి మాట్లాడని పార్టీలను ప్రజలు తిరస్కరించారన్నారు. బీసీ ఎజెండాకే ప్రజలు ఓటు వేశారన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు కనుకుట్ల మల్లయ్య, పెద్దపల్లి కోటిలింగం, సమ్ము రాజన్న, సోమన్న, భూమన్న, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన

తానూరు: ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని ఎల్వి, ఝరి(బి), జౌలా(బి), సింగన్‌గాం గ్రామాల్లో 2022–23 సంవత్సరంలో చేపట్టిన పనులను శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఏర్పాటు చేసుకున్న ఫాంపాండ్ కొలతలు తీసుకున్నారు. గ్రామాల్లో చేపడుతున్న నర్సరీ పనులు పర్యవేక్షించి నివేదికలు తయారుచేశారు. ఏపీవో గంగాధర్, డీఆర్పీలు సిబ్బంది తదితరులు ఉన్నారు.

విరాళం

తాంసి: గ్రంథాలయం నిర్మాణానికి మండలంలోని కప్పర్లలో గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన యువకుడు అంకుష్‌రావు తనవంతుగా రూ.5 వేలు విరాళం గ్రామస్తులకు అందజేశాడు. ఈసందర్భంగా అంకుష్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని గడియారం కాలనీకి చెందిన యువకుడు కొత్త అశోక్ శనివారం మృతి చెందడంతో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న నాయకులు ప్రభాకర్, వరప్రసాద్, క్రాంతి, సురేశ్, సాయిబాబా, వినోద్, అరుణ్, రాజన్న పాల్గొన్నారు.

రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్‌రూరల్: రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సర్వారాజ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ రెసిడెన్షియల్ గిరిజన పాఠశాల, కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి, రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు చికిత్స చేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన భోజనం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీవాణి, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేంసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆగస్టీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి పల్లకిని శనివారం ఊరేగించారు. ఊరేగింపులో కప్పర్ల, జామిడి, నిపాని, తాంసి, పిప్పల్‌కోటి గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షాదారులు పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు సతీష్, మధుకర్, సర్పంచ్ సదానంద్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, స్వాములు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: బహుజన్ టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నుకున్నారు. కార్యవర్గ సమావేశానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి హాజరయ్యారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా దామోదర్, శ్రీకాంత్, నాగరాజు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కాంబ్లే విజయ్ కమార్, ప్రధాన కార్యదర్శిగా సూర్యవంశీ నాందేవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.